సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 21 । మార్చి । 2023



సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు.

- 8లో



ముగ్గురికి జీవిత ఖైదు

అన్నమయ్య జిల్లాలో వేర్వేరు హత్య కేసుల్లో సోమవారం కోర్టు ముగ్గురికి జీవిత ఖైదు విధించింది.

- 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.172
రెండోరకం	రూ.80	రూ.118

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 219 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	590
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 164.24 కిలోలు

రాములోరికి బ్రహ్మోత్సవ శోభ



రామయ్య కోవెల వద్ద చలువ పందిళ్ల నిర్మాణాలు

- ఈనెల 30 నుంచి ఏకశిలా నగరిలో బ్రహ్మోత్సవాలు
- చకచకా..కల్యాణవేదిక ప్రాంగణం పనులు
- ఏప్రిల్ 5న సీతారాముల కల్యాణం
- హాజరుకానున్న ముఖ్యమంత్రి, రాష్ట్ర గవర్నర్
- ఇప్పటికే వేగవంతంగా పనులు పూర్తి చేస్తున్న యంత్రాంగం

సాక్షి రాయచోటి/ఒంటిమిట్ట/రాజంపేట: ఏకశిలానగరిలో రాములోరి పండుగకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒంటిమిట్టలోని కోదండ రాముని బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల–తిరుపతి దేవస్థానం అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. కోదండరాముడి కల్యాణోత్సవాన్ని ఈసారి మరింత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. మార్చి 30 నుంచి అంబరాన్ని అంటేలా రాములోరి సంబరాలు జరగనున్నాయి.

టీటీడీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవ వైభవానికి ముందే ఆలయం చుట్టూ మాఢవీధుల్లో రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయడంతో అందంగా కనిపిస్తున్నాయి. ఆలయ సమీపంలో పుష్కరిణిని కూడా తీర్చిదిద్దారు. ఆలయ దక్షిణ గోపురం ముందు భాగాన పార్కును పూర్తి చేయడంతో పచ్చదనంతో కళకళలాడుతోంది. టీటీడీ ఆధ్వర్యంలో సుమారు రూ. 100 కోట్ల వ్యయంతో అనేక రకాల అభివృద్ధి పనులను పూర్తి చేశారు.

శాశ్వత కల్యాణ మండపం

ఒంటిమిట్టలోని విశాల మైదానంలో సీతారాముల కల్యాణోత్సవానికి సంబంధించి శాశ్వత మండపాన్ని నిర్మించారు. వేలాది మంది భక్తులు కూర్చొని కల్యాణాన్ని తిలకించే ఏర్పాట్లు చేస్తున్నారు. శాశ్వత నిర్మాణాలతోపాటు చలువ పందిళ్ల వేస్తున్నారు. ఆలయ సమీప ప్రాంతాలన్నింటిలోనూ వెలుగులు నింపేందుకు ఎక్కడికక్కడ లైటింగ్ సిస్టమ్‌ను అమర్చారు.



సిద్ధమవుతున్నకల్యాణ వేదిక

ఏప్రిల్ 5న రాములోరి కల్యాణం

ఒంటిమిట్ట ఆలయ సమీపంలోని విశాల మైదానంలో ఏప్రిల్ 5న పౌర్ణమి చంద్రుని సాక్షిగా సీతారాముల కల్యాణాన్ని వేలాది భక్తుల మధ్య పండుగ వాతావరణంలో కడు రమణీయంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు గవర్నర్, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. అలాగే ప్రతిరోజు స్వామి వారి సంకీర్తనలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తుల సందడితో ఏకశిలానగరం అలరారనుంది.



కొనసాగుతున్న ఫ్లడ్ లైట్ల ఏర్పాటు పనులు

అన్నప్రసాదాల వితరణకు ముందుకొచ్చిన మేడా

సీతారాముల కల్యాణం రోజున 80వేల మందికి అన్నప్రసాదాల వితరణ చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం కోరిన మేరకు టీటీడీ బోర్డు మాజీ డైరెక్టర్ మేడా రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదనరెడ్డిలు ముందుకొచ్చారు. ఈమేరకు టీటీడీ ఈఓ, జేఈఓలతో చర్చించారు.

వేగవంతంగా ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వేగవంతంగా చర్యలు చేపడుతున్నారు. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, టీటీ డీ జేఈఓ వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఇప్పటికే పలుమార్లు పర్యటించి పనులను పరిశీలించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా గ్యాలరీల నిర్మాణం, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పా టు, వసతి సౌకర్యాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేయనున్నారు. వాహనాల పార్కింగ్, వీవీఐపీల తాకిడి నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు, తలంబ్రాల ప్యాకెట్ల పంపిణీ మొదలుకొని ఇలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు ఇలా..



కోవెలలోని సీతారామలక్ష్మణ మూలవిరాట్లు

30న శ్రీరామనవమి, ఏప్రిల్ 3న హనుమత్ సేవ, 6న రథోత్సవం, 8న చక్రస్నానం, 9న పుష్పయాగం లాంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే 31న శేషవాహనం, 1న వేణుగానాలంకారం, రాత్రి హంసవాహనం, 2న వటపత్ర అలంకారం, రాత్రికి సింహవాహనం, 3న నవనీత కృష్ణాలంకారం, 4న మోహినీ అలంకారం, రాత్రికి గరుడసేవ, 5న రాత్రి గజవాహనం, ఉదయం శివధనుర్భంగాలంకారం, 7న కాళీయమర్దనాలంకారం, రాత్రికి అశ్వవాహనం ఉంటాయి. 31న బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, 6న ధ్వజావరోహణం నిర్వహించనున్నారు.

పటిష్ట బందోబస్తు

కోదండ రామస్వామి కల్యాణోత్సవం సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కడప, దిశ, పులివెందుల, జమ్మలమడుగు డీఎస్పీలు వెంకట శివారెడ్డి, వాసుదేవన్, శ్రీనివాసులు, నాగరాజు పేర్కొన్నారు. సోమవారం కోదండ రామస్వామి కల్యాణ వేదిక, సాలాబాద్ క్రాస్ రోడ్డు, కోదండ రామస్వామి ఆలయం వద్ద వారు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. స్వామి వారి కల్యాణోత్సవానికి సుమారు 3500 నుంచి 4000 మంది పోలీసులు బందోబస్తుకు రానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ పురుషోత్తం రాజు, ఎస్‌ఐ మధుసూదన్, ఒంటిమిట్ట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణ వేదిక వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీలు, సిబ్బంది

ప్రణాళికాబద్ధంగా చర్యలు



ఒంటిమిట్టలో కోదండరాముని బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవానికి సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రణాళికాబద్ధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. 5న జరిగే కల్యాణోత్సవం సందర్భంగా కల్యాణవేదిక, పరిసర ప్రాంగణం పనులు, భక్తుల సౌకర్యాల పనులపై దృష్టి సారించారు.

–వీరబ్రహ్మం, జేఈఓ, టీటీడీ, తిరుపతి

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటి: రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాడ్పుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో వడగాడ్పులు, ఎండ తీవ్రతపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ముఖ్య కూడలి ప్రదేశాలలో చలువ పందిళ్ల, చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపాల్టీ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. ఈ సమీక్షలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, మదనపల్లి ఆర్‌డీఓలు రంగస్వామి, మురళీ పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడిపై దృష్టి పెట్టాలి

జిల్లాలో వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సోమవారం పలు అంశాలపై ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, ఏపీఓలు, ఏపీఎంలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ప్రశాంతంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

రాయచోటి: జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్య తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం మ్యాథ్స్, బాటనీ, సివిక్స్ పేపర్–1 పరీక్షలు నిర్వహించామన్నారు. 15659 మంది విద్యార్థులకు 14930 మంది హాజరయ్యారన్నారు.

20 నుంచి పోషణ్ పఖ్వాడా అవగాహన

రాయచోటి : ఈ నెల 20వ తేదీ నుంచి ఏప్రిల్ 03వ తేదీ వరకు పోషణ్ పఖ్వాడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో పోషన్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో అధికారులకు ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, డీఆర్‌డీఏ, అగ్రికల్చర్, స్కూల్ ఎడ్యుకేషన్, హార్టికల్చర్, డీఎంహెచ్‌ఓ, మునిసిపల్, వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్లు జిల్లా స్థాయి నుంచి సచివాలయం స్థాయి వరకు భాగస్వామ్యం కావాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో లబ్ధిదారులుగా ఉన్న 6 సంవత్సరాలలోపు పిల్లల ఎత్తు, బరువు కొలత, ఆరోగ్యకరమైన పిల్లల గుర్తింపు, టెస్ట్ ట్రీట్, టాక్ అనీమియా, ఆరోగ్యకరమైన తల్లి,బిడ్డ కోసం సంప్రదాయ ఆహారాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రత పాటించాలి

రాయచోటి టౌన్: నోరు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య తెలిపారు. సోమవారం రాయచోటిలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటి దుర్వాసన ద్వారా కూడా మనం అనారోగ్యానికి గురవుతుంటామన్నారు. డీసీహెచ్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నోటి శుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శేషగిరి, డాక్టర్ రెడ్డి కీర్తి, డాక్టర్ ఖదీర్ బాషా, డాక్టర్ బాబాఫక్రుద్దీన్, లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ హరినాథరెడ్డి, లయన్ శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో నేలకొరిగిన వృక్షాలు

రాజంపేట టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం తెల్లవారుజామున వీచిన గాలికి.. దశాబ్దాల కాలం నాటి మూడు భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో కొన్ని కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటంతో కళాశాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఆ పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రామిరెడ్డి కళాశాలకు వచ్చి విద్యుత్ సరఫరా లేని విషయాన్ని గుర్తించారు. దీంతో ఆయన విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా పరీక్షను రాయగలిగారు. విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించకుండా ఉండి వుంటే.. కొన్ని గదుల్లో విద్యార్థులకు సరైన వెలుతురు అందక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇదిలా వుంటే నేలకొరిగిన మూడు భారీ వృక్షాల్లో ఒకటి సెంటర్ హాల్‌పై పడగా, మరో రెండు పక్కనే ఉన్న ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం గది వద్ద నేలకొరిగాయి. కళాశాల, పాఠశాల వేళలో ఈ చెట్లు నేలకొరిగి వుంటే తీవ్ర ప్రమాదం జరిగేదని అధ్యాపకులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ముగ్గురికి జీవిత ఖైదు

- వేర్వేరు హత్య కేసుల్లో..
- మోటారు నుంచి నీరు విడిచేందుకు జరిగిన గొడవలో తండ్రి, తనయుడికి..
- సారా కాచే విషయమై చోటుచేసుకున్న ఘర్షణలో ఓ వ్యక్తికి


ముద్దాయిలు మేడా శ్రీహరి, రఘుతో పోలీసులు

రాజంపేట : అన్నమయ్య జిల్లాలో వేర్వేరు హత్య కేసుల్లో సోమవారం ముగ్గురికి జీవిత ఖైదు పడింది. రాజంపేటలో తండ్రి, తనయుడికి.. రాయచోటిలో ఓ వ్యక్తికి ఈ శిక్ష విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజంపేటలోని చిన్నచావిడి వీధిలో గోబి బండి ద్వారా జీవనం సాగిస్తున్న పబ్బతి బాలాజీ.. పొరుగులో ఉన్న మేడాశ్రీవారి, అతని కుటుంబ సభ్యులు రోజూ చీటికిమాటికి గొడవ పడేవారు. ఒక మోటారుతో ఇద్దరికీ నీటి సరఫరా, మోటారు వేసే విషయంలో ఈ ఘర్షణలు తలెత్తేవి. ఈ క్రమంలో 2019 మే 19న మేడా శ్రీహరి, అతని కుమారుడు రఘు, కుటుంబ సభ్యులతో కలిసి మూకుమ్మడిగా బాలాజీపై కట్టెలతో దాడి చేశారు. అతను మృతి చెందాడు. మృతుడి కుమార్తె లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి రాజంపేట పట్టణ ఎస్‌ఐ హనుమంతరావు హత్య కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ నిరంజన్‌కుమార్ దర్యాప్తు నిర్వహించి నిందితులను అరెస్టు చేశారు. అనంతరం సీఐగా పని చేసిన శుభకుమార్ చార్జీషీట్ దాఖలు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాజంపేట డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ నరసింహారావు, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, గంగాధర్‌లు నిందితులను కోర్టులో హాజరు పరిచారు. తండ్రి మేడాశ్రీహరి, తనయుడు రఘుపై నేరం రుజువు కావడంతో వారికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ విధిస్తూ రాజంపేట మూడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ తీర్పు ఇచ్చారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మహమ్మద్‌జానీ వాదనలు సమర్థవంతంగా వినిపించారు.

కర్రతో తలపై మోది..


నిందితుడు నాగానాయక్

రాయచోటి టౌన్ : సారా కాచే విషయమై జరిగిన హత్య కేసులో నాగానాయక్ (55)కు జీవిత ఖైదు విధిస్తూ రాయచోటి 5వ అదనపు న్యాయమూర్తి క్రిష్టన్ కుట్టి తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2016లో సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం కొత్తపల్లె బిడికి మూడే నాగానాయక్, అదే గ్రామానికి చెందిన పల్లపు వెంకటస్వామి మధ్య సారా కాచే విషయంలో గొడవ జరిగింది. ఆ సమయంలో నాగానాయక్ కర్రతో పల్లపు వెంకటస్వామి తలపై మోదడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి విచారణ సాగింది. నాగానాయక్‌పై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతోపాటు రూ.2000 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. అడిషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసుకు సంబంధించి సంబేపల్లె ఎస్‌ఐ ఎస్‌ఎండీ షరీఫ్, రూరల్ సీఐ లింగప్ప విచారణలో పాల్గొన్నారు.

రైల్వే లోకోపైలెట్ల నిరసన


నందలూరులో నిరసన చేపడుతున్న లోకోపైలెట్లు

నందలూరు (రాజంపేట) : ఉభయ జిల్లాలో రైల్వే పరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వేకేంద్రంలో ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్‌ఎఫ్) పిలుపు మేరకు సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం లోకోరన్నింగ్ స్టాఫ్ క్రూ లాబీ ఎదుట లోకోపైలెట్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లోకో రన్నింగ్ స్టాఫ్ నేతలు కేఎస్ఎన్ రెడ్డి, ఎస్‌కేఎండీ జావిద్, ఏఐఎల్‌ఆర్ఎస్ నాయకులు సుజీత్, ఏఐజీసీ నాయకులు బీవీ ప్రశాంత్, బీ.శివకుమార్ రాజు, రమేష్‌బాబు మాట్లాడారు. రన్నింగ్‌స్టాఫ్ పట్ల ఉద్యోగుల పట్ల రైల్వేబోర్డు ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలన్నారు. లీవ్, రెస్ట్‌లు ఇవ్వకుండా మానసికంగా వేధించడం మానివేయాలన్నారు. రన్నింగ్‌రూంలో మొబైల్స్ హ్యాండ్ అవర్ చేయాలన్న నియమాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. సిక్ రుజువుకు ఫొటోలు చూపాలన్న నియమం సరికాదన్నారు. రన్నింగ్‌స్టాఫ్ భారతీయ రైల్వేకి వెన్నముక లాంటి వారన్నారు. అన్యాయపు నియామలను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో రన్నింగ్‌స్టాఫ్ పాల్గొన్నారు.

కుక్క అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి..

దంపతులకు తీవ్ర గాయాలు



గాయపడిన అబ్దుల్‌రహీం, నాదిరాబేగం

మదనపల్లె : కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం గుర్రంకొండ మండలంలో జరిగింది. కలికిరి మండలం గుండ్లూరుకు చెందిన అబ్దుల్‌రహీం బీఎస్‌ఎఫ్ జవాన్‌గా జార్ఖండ్‌లో పని చేస్తున్నారు. ఇటీవల సెలవుపై వచ్చిన ఆయన పలమనేరులోని అత్తవారింటికి వెళ్లాడు. సోమవారం భార్య నాదిరాబేగం(46)తో కలిసి ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనులపై రాయచోటికి బయలుదేరారు. మార్గంమధ్యలో మొటుకు క్రాస్ వద్ద కుక్క ద్విచక్రవాహనానికి అకస్మాత్తుగా అడ్డురావడంతో అదుపుతప్పి దంపతులిద్దరూ కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్ట్ సిబ్బంది గుర్రంకొండ పోలీసులకు సమాచారం అందించారు.

కరెంట్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు


తీవ్ర గాయాల పాలైన మహేష్

మదనపల్లె : కరెంట్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. బి.ఎన్. రెడ్డి కాలనీకి చెందిన రామయ్య కుమారుడు మహేష్ భవన నిర్మాణ కార్మికుడిగా మేస్త్రీ సుధాకర్ వద్ద పని చేస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం ఏడీఎస్ వద్ద భవన నిర్మాణ పనులు చేస్తుండగా, మిద్దెపై వెళుతున్న 11కే.వి. విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. భవనం పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని తనయుల ఆత్మహత్య

- వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు..
- చదువుపై శ్రద్ధ పెట్టని ఒకరు..
- తాగుడుకు బానిసై మరొకరు..


మృతి చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి


రెడ్డేనాయక్ మృతదేహం

మదనపల్లె : తల్లిదండ్రులు మందలించారని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం ఇద్దరు తనయులు ఆత్మహత్య చేసుకున్నారు. మదనపల్లె మండలంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి, కలకడ మండలంలో ఓ యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లె మండలంలోని కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి కుమారుడు వి.కిరణ్‌కుమార్‌రెడ్డి(20) స్థానికంగా ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కళాశాలకు గైర్హాజరవడం, ద్విచక్ర వాహనాన్ని కుదువపెట్టి చదువుపై నిర్లక్ష్యం కనపరచడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన కిరణ్ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించి పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఆత్మహత్య సమాచారాన్ని స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో.. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఓబుల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

పురుగుల నివారణ మందు తాగి..

కలకడ : తాగుడుకు బానిసైన కుమారుడు.. తండ్రి మందలించాడని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకడ మండలం దిగువతండా పంచాయతీ ఎగువతండాలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎగువతండాకు చెందిన శంకర్‌నాయక్ తన కుమారుడు రెడ్డినాయక్(20)ను సారా జోలికి వెళ్లవద్దని మందలించాడు. మనస్తాపానికి గురైన రెడ్డినాయక్ పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి శంకర్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

- చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th,ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, B.Tech, BCA, MCA పాసయ్యే ఛాన్స్ కలదు. నాగేష్ అకాడమీ, కడప. 75694 70023 [G-6355]

REAL ESTATE

PLOT FOR SALE

- Maruthinagar Near Kesavareddy School 11సెంట్లు స్థలం అమ్మబడును. అనంతపురం సంప్ర: 8500236681 [H-796737]
- భాష్యం న్యూ HMDA వెంచర్ హైదరాబాద్ @ కొత్తూరు బెంగుళూరు హైవే 1 K.M అన్ని డె॥ క్లబ్‌హౌస్, స్విమ్మింగ్ పూల్ 50% బ్యాంక్ లోన్‌తో ప్లాట్లు కలవు. Ph: 9951329192 [HA-846]

LAND FOR SALE

- For Sale Single bit prime Land of 163 Acres. Clear title. Near Highway road-front. Excellent environment for living, business and agriculture. Red soil with high iron content. Nawabpet (V),Chityala(M),Jayashankar Bhupal pally (D). Contact: 7675868777, 9390085828. info@amodagroup.com [HA-26338]

SERVICES

- పర్సనల్, బిజినెస్,ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి వారం రోజులలో రుణంఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. 8598800260, 8901923173. [T-1783]

బంగారం కొనబడును

- మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 5663]

పాస్‌పోర్ట్ పోయినది

- నా పేరు చెన్నమరెడ్డి ఇందిరా D/o. చెన్నమరెడ్డి భాస్కర రెడ్డి, పాస్‌పోర్ట్ నెం. : N4001523, దొరికిన వారు 5/67A, సింహాద్రిపురం గ్రామం & మండలం, YSR జిల్లా గల అడ్రస్: Cont: 9966672787 కు తెలుపగలరు. [C-1161923]

CHANGE OF NAME

- I, SHAIK MAHAMMAD, R/o. 7-4313, Srinivasa Nagar, Proddatur, Kadapa Dist., A.P. Now I change my name as GADDARAPU AHAMMAD BASHA S/o. GADDARAPU BABAIAH. [C-1161981]
- I, SHAIK BEEBI, R/o. 7-4327-3-1, Srinivasa Nagar, Proddatur, Kadapa Dist., A.P. Now I change my name as GADDARAPU PYARIJAAN W/o. GADDARAPU BABAIAH. [C-1161982]

BUSINESS OFFER

- Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్, ✆ 9319814720. [T-1196145]

WANTED

- ప్రొద్దుటూరులోని ఇండియన్ గ్యాస్ నందు పనిచేయుటకు డ్రైవర్స్, డెలివరి బాయ్స్, హెల్పర్స్, టెలికాలర్స్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 9030057777, 9246395566. [C-781450]
- Wanted Full time with Computer Skill Office Assistant for medical Agency at Kadapa. Must be a Graduate, Kadapa Local Candidates only. 9885218629, 8437437044. [C-781465]
- కడపలోని హోటల్ నందు పని చేయుటకు వెజ్ & నాన్ వెజ్ బాగా చేయగల, అనుభవం గల వంట మాస్టర్, లేడి సూపర్‌వైజర్స్ మరియు పనిమనిషి కావలెను. సం॥7981952392. [C-781428]
- ప్రొద్దుటూరు పట్టణములోని నోబుల్ కిడ్స్ స్కూలుకు గాను Incharge మరియు Head Teachers కావలెను. Incharge గా 5 సం॥ల అనుభవము కలిగిన Teachers మాత్రమే apply చేసుకోగలరు. బయోడేటాను Whatsapp చేయగలరు. 7075018555, 8919721081. [C-1161980]
- JOB VACANCY. Age 18 to 45, 10th to Any Degree, Office job 18,000 to 25,000, Work from home 15,000 to 18,000, ✆ 8712008071. [T-1120]
- సెక్యూరిటిగార్డ్స్ సూపర్‌వైజర్స్ హైదరాబాద్‌లో పని చేయుటకు కావలెను. జీతం: 13,000 -15,000/- రూం+భోజనం ఫ్రీ. Ph: 7569329230, 9848229947 [HA-10373]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795232]
- ఉద్యోగాలు: S.R. నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 28 నో ఫీజ్, Cell: 9177342337. [WA-6917]
- VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999 [HA-1124]
- జీతం: 10K-25K+ రూం Free, Hyd. Qul: 5th- any Degree. Urgent గా కావలెను. స్త్రీలు/ పురుషులు, Nurses, Caretaker కావలెను. ఫోన్ : 9000250893 [HA-92671]
- ప్రముఖ ఫ్యాక్టరీలో పని చేయుటకు S.O, A.S.O, Guards కావలెను. 8 గంటల డ్యూటీ. Salary + Food + P.F + ESI సౌకర్యం కలదు. సంప్ర : 99590 86190, 90630 57461. [NA-11392]
- URGENT REQUIREMENT AT GUDUR for Manufacturing Company. Drivers-05, Fitters-12, Welder-12 and Business Development Associate-10 (Any Graduate). Please Mail us at : job.gdrp@gmail.com [N-1226002]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

ఇంట్లోని వస్తువులు బూడిదైన వైనం


కాలిబూడిదైన వస్తువులు

చిన్నమండెం : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటికి నిప్పంటుకోవడంతో వస్తువులన్నీ కాలిబూడిదయ్యాయి. ఈ సంఘటన చిన్నమండెం మండలం టి.చాకిబండ గ్రామ పంచాయతీకస్పాలో ఉంటున్న దేవగుడిపల్లె గ్రామం కురవపల్లెకు చెందిన శంకరయ్య ఇంట్లో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శంకరయ్య వృత్తిరీత్యా కొత్తపల్లి గ్రామ పంచాయతీలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన భార్య రాధిక అదే ఇంటిలో మెడికల్ క్లినిక్ నడుపుతోంది. శంకరయ్య సచివాలయంలో పని చేస్తుండగా.. ఆయన భార్య వారు నివాసం ఉంటున్న వీధిలో వైద్యం చేసేందుకు వెళ్లారు. అదే సమయంలో ఇంట్లో వారి 4 ఏళ్ల బాలుడు నిద్రిస్తున్నారు. ఒక్కసారిగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకొని పొగలు వచ్చాయి. గమనించిన స్థానికులు తలుపులు బద్దలు కొట్టి బాలున్ని సురక్షితంగా బయటికి తీసుకువచ్చారు. వెంటనే అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖాధికారి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న విలేజ్ రెవెన్యూ అధికారి ఇంటిని పరిశీలించారు. ఇంట్లో రూ.6 లక్షల విలువ చేసే వస్తువులు పాడైపోయినట్లు బాధితులు తెలిపారు. వాటిలో మెడికల్ క్లినిక్ సామాన్లు, బట్టలు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.90 వేల నగదు, కూలర్, బీరువా, ఫర్నీచర్, సెల్‌ఫోన్లు, టీవీ, ఫ్రిజ్‌లు ఉన్నాయి. కట్టుకున్న బట్టలు తప్ప ఇంట్లో ఉన్న సామగ్రి సహా మొత్తం కోల్పోయినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు


జిల్లా ఎస్పీ నుంచి రివార్డు అందుకుంటున్న రాయచోటి డీఎస్పీ శ్రీధర్

రాయచోటి : సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ఆవరణలో సోమవారం సైబర్ క్రైమ్ అండ్ సాంకేతిక పరిశోధన కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైం కార్యాలయంలో సిబ్బంది అనునిత్యం అందుబాటులో ఉంటారన్నారు. సైబర్ నేరాల బాధితులు 1930 నంబర్‌కు ఫోన్ చేసి, లేక www.cybercrime.gov.in లో కానీ ఏపీ సైబర్‌మిత్ర మొబైల్ నంబర్ 91211100కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు ఉంటాయని చెప్పారు.

రివార్డులు.. అభినందనలు

ఎమ్మెల్సీ ఎన్నికలు, టీడీపీ నేత లోకేష్‌నాయుడు పాదయాత్రలో విధులు నిర్వర్తించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు రివార్డులు అందజేసి, అభినందనలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందికి రివార్డులు అందజేశారు. అన్నమయ్య జిల్లా పోలీస్ సేవలు అన్నీ ఒకే చోట ప్రజలు పొందేందుకు వీలుగా http://annamayyapolice.in వెబ్‌సైట్‌ను రూపొందించడం జరిగిందన్నారు. పై వెబ్‌సైట్‌లో స్పందన, ఈ చలానా, సైబర్ క్రైమ్ రిపోర్టింగ్, మీసేవా పోర్టల్, పాస్‌పోర్ట్ సేవా, కేసు స్టేటస్ చెకింగ్, ఇతర సేవలు పొందవచ్చని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్: జిల్లాలో వివిధ ఐసీడీస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు 23, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు 9, సహాయకులు 80 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 27వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

ఐదుగురికి తీవ్ర గాయాలు

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయితీ ఐరీస్ హోటల్ సమీపంలో సోమవారం పెట్రోల్ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి డిపోకు చెందిన బస్సు కడప నుంచి రాయచోటికి వస్తోంది. ఇది రామాపురం మండలం బండపల్లె పంచాయతీ ఐరీస్‌హోటల్ సమీపానికి రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా.. ఎదురుగా రాయచోటి వైపు నుంచి కడపకు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీ కొంది. బస్సు డ్రైవర్ అల్లా బకాష్‌కు తీవ్ర గాయాలు కాగా, బస్సులో ప్రయాణిస్తున్న లక్ష్మీదేవి, చిన్నక్క, పెద్దరెడ్డయ్య, అమృతబీకి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురిటిబిడ్డ చికిత్సలో ప్రభుత్వ వైద్యసిబ్బంది నిర్లక్ష్యం

- పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు
- ఆవేదన వ్యక్తం చేసిన తల్లిదండ్రులు


పసికందు శరీరంపై వచ్చిన బొబ్బలు


మీడియాతో ఆవేదన వ్యక్తం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్ మహేశ్వర్‌రెడ్డి

మదనపల్లె : పురిటి పసికందు విషయంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యంతో ఆరోగ్యపరిస్థితి విషమించడంతో చివరిక్షణంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించిన ఘటన సోమవారం జరిగింది. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో డబ్బులు ఇస్తేనే వైద్య చికిత్సలు అందుతున్నాయని, పేదలను వైద్యులు పట్టించుకోవడం లేదని తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెకు చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ మహేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల14న మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తన భార్య అరుణారెడ్డిని రెండో కాన్పు నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించామన్నారు. 15న వైద్యులు శస్త్రచికిత్స చేయగా మగబిడ్డను ప్రసవించిందన్నారు. బిడ్డను ప్రసవం తర్వాత కొంతసేపు ఎస్‌ఎన్‌సీయూలోని వార్మర్స్‌లో ఉంచారన్నారు. మూడు రోజుల క్రితం పసికందు శరీరంపై చిన్న బొబ్బలు రావడంతో వైద్యులు పరీక్షించి పూత మందు వాడాల్సిందిగా సూచించారన్నారు. మందులు వాడినప్పటికీ బొబ్బలు తగ్గలేదన్నారు. ఈ విషయంపై స్టాఫ్ నర్సుల దృష్టికి తీసుకెళితే.. వారు పట్టణంలోని ఓ చిన్నపిల్లల ప్రైవేట్ ఆస్పత్రి పేరు చెప్పి అక్కడకు వెళ్లి చికిత్సలు చేయించుకోవాలని చెప్పారన్నారు. శరీరంపై బొబ్బలతో బిడ్డ పాలు తాగకుండా ఏడుస్తున్నాడని తల్లి అరుణారెడ్డి కన్నీటిపర్యంతమైంది. కాన్పు కోసం ప్రభుత్వాసుపత్రికి వచ్చినప్పటి నుంచీ శస్త్రచికిత్స చేసినందుకు, తిరిగి వార్డులోకి తీసుకువచ్చినందుకు, బెడ్‌షీట్ వేసినందుకు ఆస్పత్రి సిబ్బంది తమ వద్ద నుంచి రూ.5 వేలు తీసుకున్నారని తెలిపారు. గతంలో మొదటికాన్పుకు వచ్చినప్పుడు రూ.10 వేలకు పైగా తీసుకున్నారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి పూర్తిగా అవినీతిమయంగా మారిందని, డబ్బులిస్తే తప్ప సిబ్బంది చికిత్సలు అందించేందుకు ముందుకురావడం లేదన్నారు. రోగి పరిస్థితి ఏమాత్రం విషమించినా వైద్యచికిత్సలు అందించాల్సింది పోయి ఫలానా ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లండంటూ కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. ప్రతి పనికీ ప్రభుత్వ ఆస్పత్రిలో ఇంత చొప్పున లంచం ఇవ్వాల్సిందేనన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణం ప్రభుత్వాసుపత్రిపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వం ప్రభుత్వవైద్యశాలల్లో ఎన్ని సదుపాయాలు కల్పించినా పేదలకు మెరుగైన వైద్యచికిత్సలు అందవన్నారు. తమ బిడ్డను ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించేందుకు తీసుకెళుతున్నామని, తమలా ఇతరులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆస్పత్రి సిబ్బంది నిర్వాకంపై మీడియాకు తెలుపుతున్నట్లు వివరించారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరిండెంట్ పద్మాంజలి దేవిని వివరణ కోరితే.. ఆస్పత్రిలో డబ్బులు వసూళ్లు తన దృష్టికి రాలేదని, ఎవరైనా సిబ్బంది వసూలు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యుడు అందుబాటులో ఉన్నారని, బిడ్డను ఆయనకు చూపిస్తే చికిత్సలు అందిస్తారని తెలిపారు.